క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక


జీఎస్ భావన

చిప్పగిరి: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని జీయస్ భావన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ఎంఈఓ మస్తాన్ రావు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఆ విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందిస్తుందని చెప్పారు.

చిరుధాన్యాలలో పోషకాలు

చిప్పగిరి: చిరుధాన్యాలలో అధిక పోషకాలు ఉంటాయని గర్భవతులు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన సూచించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలలో తగిన బరువు కలిగిన పిల్లలకు బుధవారం తహసీల్దారు లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బహుమతులు అందించారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పలువురు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

హొళగుంద: చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాల్లో పోషకాలు అధికంగా ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీఓ లలిత అన్నారు. బుధవారం హొళగుందలో పోషణ పక్వాడ కార్యక్రమంలో ఎంపీపీ నూర్జహన్, ఎంపీడీఓ దాసానాయక్, డాక్టర్ రాధమ్మ, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ షీబా రాణి తదితరులు పాల్గొన్నారు. గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు

ఇంటింటికీ కుళాయి కనెక్షన్

నందవరం: పెద్దకొత్తిలి గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కుళాయి కనెక్షన్లు ఇస్తామని సర్పంచ్ బైటిగేరి శివన్న పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. తుంగభద్ర నది నీటిని ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుకు పంపింగ్ చేసి, నూతన పైపులైన్ ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తామన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ ఫెసిలేటర్ కరుణప్ప, ఆర్డీఎఫ్ సంస్థ కార్యకర్త ఉసేని, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, రాముడు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

భీమలింగేశ్వరుడి పల్లకోత్సవం


ఎనిమిది పల్లకీలతో ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో భీమలింగేశ్వర స్వామి, లక్ష్మీదేవిల దేవర పల్లకీ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ నెల 26 నుంచి ప్రారంభమైన దేవర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామిని గార్లదిన్నె, చిన్నమర్రివీడు, గొల్లలదొడ్డి, గాజులదిన్నె, పెద్దమర్రివీడు, చిన్నకొత్తిలి, అల్వాల, కులమాల గ్రామాల భక్తులు పల్లకీల్లో ఊరేగించారు. ఎనిమిది పల్లకీలను దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ అధికారులు

గోనెగండ్ల: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక (బస్టాండ్) పాఠశాలలో జరుగుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్య పరీక్షలను సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి టి.శివశంకర్, ప్రథమ్ జిల్లా కో–ఆర్డినేటర్ నరేష్, ఎంఈఓ వినోద్ కుమార్ బుధవారం పరిశీలించారు. అలాగే 3, 4, 5 తరగతుల విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. వారు మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను లెవెల్ 1, 2లుగా విభజించి వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. అలాగే గణితంలో చతుర్విధ ప్రక్రియలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో తేడాలొస్తే చర్యలు

ఆలూరు: స్థానిక సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్ నుంచి వివిధ గ్రామాలకు పంపిణీ చేసే రేషన్ సరుకుల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని పత్తికొండ ఆర్డీఓ ఎం.మోహన్‌దాస్ హెచ్చరించారు. ఎల్లార్తి రోడ్డు సమీపంలోని సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్ఐ వివిధ గ్రామాలకు చెందిన డీలర్లకు మంజూరు చేస్తున్న బియ్యం, చక్కెర, కందిబేడలు తదితర వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పీఓఎల్ఆర్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని వీఆర్వోలకు సూచించారు. అలాగే హాలహర్వి మండల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆలూరు, హాలహర్వి తహసీల్దార్లు విజయ్‌కుమార్, మల్లికార్జునస్వామి తదితరులు ఉన్నారు.

చేనేత పితామహుడికి సలాం

- నేడు మాచాని సోమప్ప 45వ వర్ధంతి
- మొదటి పద్మశ్రీ అవార్డు గ్రహీత
- జిల్లాలో పాణ్యం సిమెంట్ వ్యవస్థాపకులుగా, విద్యాదాతగా ఘనకీర్తి


పద్మశ్రీ మాచాని సోమప్ప (ఫైల్)

ఎమ్మిగనూరు: సామాన్యుడిగా ప్రస్థానం మొదలుపెట్టి చేనేతల సంక్షేమానికి, సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేసిన మాచాని సోమప్ప చేనేత పితామహుడిగా కీర్తి పొందారు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి పద్మశ్రీ పురస్కారం అందించడం విశేషం. మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన సోమన్న, తిప్పమ్మ దంపతులకు ఏడుగురు సంతానం. 1904లో 6వ సంతానంగా మాచాని సోమప్ప జన్మించారు. కర్నూలు కోల్స్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం సాగింది. 1934లో తీవ్ర కరువు, దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ ప్రాంత చేనేత కార్మికుల కోసం కరువు రిలీఫ్ సెంటర్‌ను ఏర్పాటుచేసి ఆదుకున్నారు. చేనేత కార్మికుల జీవనోపాధులను మెరుగుపర్చేందుకు 1938లో వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీని స్థాపించారు. సొసైటీ ద్వారా ముడి సరకులను సరఫరా చేస్తూ చేనేత, జనతా వస్త్రాల తయారీలో ఎమ్మిగనూరు చేనేతలకు గుర్తింపు తెచ్చారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో చేనేత కో–ఆపరేటివ్ స్టోర్‌లను తెరచి చేనేతలు తయారుచేసిన వస్త్రాలు, దుప్పట్లను విక్రయించేవారు. జాతీయ నేతలు బాబు


ఎమ్మిగనూరులోని వీవర్స్ సొసైటీ కార్యాలయం

రాజేంద్రప్రసాద్, మొరార్జీ దేశాయ్, ఇందిరాగాంధీ తదితరులు ఎమ్మిగనూరు చేనేత సొసైటీని సందర్శించి సోమప్ప సేవలను ప్రశంసించారు. చేనేత సొసైటీ ద్వారా ఎమ్మిగనూరు ప్రాంతంలో సుమారు 3 వేల మందికి, జిల్లాలో 12 వేల మందికి ఉపాధి చూపారు. దానికి అనుబంధంగా మరో 17 సొసైటీలను ఏర్పాటు చేశారు. వ్యాపారుల కోసం వీవర్స్ కో–ఆపరేటివ్ స్టోర్స్, వ్యవసాయదారుల కోసం మిల్క్ స్టోర్ సొసైటీ, 200 మంది చర్మకారుల కోసం లెదర్ సొసైటీలను ఏర్పాటు చేశారు. చేనేతలకు అవసరమైన నూలు తయారీ కోసం ఎమ్మిగనూరులోనే స్పిన్నింగ్ మిల్లును ప్రారంభించారు. అప్పట్లోనే 1000 మంది కార్మికులు స్పిన్నింగ్ మిల్లులో పనిచేసేవారు. విద్యాదాత, పారిశ్రామికవేత్త, మాచాని గ్రూపు కంపెనీల వ్యవస్థాపకుడిగా సోమప్ప ప్రాచుర్యం పొందారు.

పలు రంగాల్లో ఘన కీర్తి

వివిధ రంగాల్లో ప్రాచుర్యం పొందిన సోమప్ప మద్రాసు వ్యాపార గ్రూపును ఏర్పాటు చేశారు. ఈ గ్రూపు రవాణ, ఇంజినీరింగ్, వ్యవసాయం, సాంకేతిక సమాచారం, ఇంధనం, గ్రామీణ బీపీఓ, రిటైల్ రంగాల్లో విస్తరించింది. 1960లో ప్రముఖ జర్మన్ స్ప్రింగ్ తయారీదారులైన స్టంపు, షూలేతో కలసి సోమప్ప ఎస్ఎస్ఎస్ జాయింట్ వెంచర్‌ను ప్రారంభించారు.


మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రితో సోమప్ప

పాణ్యం సిమెంట్ కర్మాగారం నిర్మించి జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారు. విద్యారంగ అభివృద్ధి కోసం 1978లోనే మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఎమ్మిగనూరులో ఉన్న బాలికల ఉన్నత పాఠశాల, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, చేనేతల కోసం ప్రత్యేకంగా వీవర్స్ కాలనీలకు స్థలం ఇచ్చిన దాతగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1954లో మొదటి పద్మశ్రీ అవార్డును ఇచ్చి గౌరవించింది. 1978 మార్చి 30న ఆయన స్వర్గస్తులయ్యారు. ఈ ప్రాంత ప్రజలకు ఆయన సేవలను స్మరించుకొంటూ మున్సిపల్ సెంటర్‌లో సోమప్ప కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆరాధిస్తున్నారు. కొన్ని వేలమంది తమ పిల్లలకు సోమప్ప అనే పేరును పెట్టుకున్నారంటే ఈ ప్రాంతంలో ఆయన సేవలకు అదే తార్కాణం. ఆయన పేరుమీదనే సోమప్ప నగర్, సోమప్ప సర్కిల్ అందరికీ సుపరిచితమే. ఆయన స్ఫూర్తితో కుటుంబ సభ్యులు వివిధ ట్రస్టుల పేరిట విద్యా, వైద్య రంగాలతోపాటు సామాజిక సేవలను నేటికీ కొనసాగిస్తుండటం విశేషం.

బ్రహ్మోత్సవాలకు వేళాయె


రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం

వెల్దుర్తి: విజయనగర సామ్రాజ్య ఘనతకు కారణమైన వజ్రాల ఉత్పత్తికి మూలస్థానం, నవాబులు, బ్రిటీషుల కాలంలో తాలూకా, రిజిస్ట్రార్ కేంద్రంగా, ప్రపంచ వజ్ర నిక్షేప పటంపై తనకంటూ సుస్థిర స్థానం ఏర్పరచుకున్న నాటి రవ్వలకోట, నేటి రామళ్లకోటలో వెలసిన మహిమాన్విత వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యారు. దేవదాయ, ధర్మదాయ శాఖ, గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం 30వ తేదీ రాత్రి నుంచి గణపతిపూజతో ఉత్సవాలు ప్రారంభం కానున్నా యి. ములుకుట్ల ఆంజనేయశర్మ సోదరులు, ఆలయ అర్చకులు స్వర్గీయ రాజయ్య కుమారుల మంత్రోచ్చారణల మధ్య ఉత్సవాలు 9 రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ హనుమంతరావ్, ధర్మకర్తల మండలి చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ కొత్తూరు నాగలక్ష్మమ్మ, సెక్రటరీ వెంకటేశ్ నాయక్, వీఆర్ఓ రమణారెడ్డి, గ్రామ పెద్దలు తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9 రోజులపాటు పూజ లు, ప్రత్యేకాలంకరణలతో స్వామి అమ్మవార్లకు సింహవాహన, శేషవాహన, గరుడ, గజ సేవలు ఉంటాయి. 31న సత్యపీఠంపై స్వామి అమ్మవార్ల కళ్యాణం ఉంటుంది. ఏప్రిల్ 6న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు మడవీధిలో మహా రథోత్సవం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 14న పదహారవ రోజు పల్లకీసేవతో ఉత్సవాలు ముగియనున్నాయి.

7, 8 తేదీల్లో వివిధ పోటీలు

ఏప్రిల్ 7న పాలపండ్ల వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించి ఐదుగురు విజేతలకు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందించనున్నారు. అదే రోజు గుండు, చందా ఎత్తడం, తాడు పందేలు, సాయంత్రం ట్రాక్టర్ రివర్స్ పందెం, బైక్‌స్లో పందెం నిర్వహిస్తారు. 8వ తేదీ గిరకబండి లాగు పందెంలో నలుగురు విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు బహుమతులు ఇవ్వనున్నారు.

నేడు బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: టి.గోకులపాడులో శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకుని గురువారం సీనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లయ్య, పూల రాజు బుధవారం తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 83744 12811, 95732 03814 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి భజన పోటీలు

అలాగే గురువారం రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించి విజేతకు రూ.20 వేలు, తర్వాతి 11 స్థానాలకు దాతల సహకారంతో నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల భజన బృందాలు 97014 47250, 96664 55417 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


పత్తికొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పక్కన కర్నూలు మేయర్ బీవై.రామయ్య

పత్తికొండ రూరల్/పత్తికొండ టౌన్: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. బుధవారం పత్తికొండలోని టీటీడీ కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు మేయర్ బీవై.రామయ్య పాల్గొన్నారు. ముందుగా పొదుపు మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని 7334 మంది సభ్యులకు ఆసరా పథకం ద్వారా రూ.3,69,97,000 లబ్ధి చేకూరిందని వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై.రామయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. ఎంపీపీ నారాయణదాస్, నాగరత్న మ్మ, సర్పంచు కొమ్ముదీపిక, తహసీల్దారు విష్ణుప్రసాద్, జెడ్పీటీసీ ఉరుకుందమ్మ, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన మహిళలు

చెరువు తూము పరిశీలన

పత్తికొండ రూరల్: తూము వద్ద ఆక్రమణ ప్రాంతంలో మట్టి తొలగింపును పూర్తి చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్, తహసీల్దారు విష్ణుప్రసాద్‌లను ఆదేశించారు. బుధవారం స్థానిక షాదిఖానా వెనుక కడగొమ్ము, తూము ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. ఇన్ని రోజులుగా తూము పూడ్చివేసి మట్టి చదును పనులు జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

తుగ్గలి: నిత్యం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రజలను కోరారు. బుధవారం సాయంత్రం చిన్న జొన్నగిరిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. నాడు–నేడు కింద రూ.31 లక్షలతో చేపట్టనున్న ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ప్రజలు ఆమె దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని గ్రామస్తులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథరెడ్డి, రామచంద్రారెడ్డి, నాగేష్, పులికొండనాయక్, హనుమంతు, నాగప్ప, ప్రతాపరెడ్డి, దేవి తదితరులు పాల్గొన్నారు.


చిన్నజొన్నగిరిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పెరవలి యువకుడి ఆవిష్కరణ

మద్దికెర: విద్యుత్ సరఫరా డ్యాష్‌బోర్డులోనే తెలిసేలా సరికొత్త ఆవిష్కరణ రూపొందించి పెరవలి గ్రామానికి చెందిన అంగడి సతీష్ రెడ్డి, బృందం ప్రశంసలు అందుకుంది. ఈ డ్యాష్‌బోర్డు గురించి అధికారులు, మంత్రులకు వివరించి కర్ణాటక విద్యుత్ శాఖ మంత్రి సునీల్‌కుమార్ నుంచి అభినందనలు అందుకున్నారు. వృత్తిరీత్యా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడిన సతీష్ రెడ్డి ప్రభుత్వ ఇంధన శాఖ వారికి ఉపయోగపడేలా పరికరాన్ని అభివృద్ధి చేశారు. విద్యుత్ ఉత్పాదన, ప్రసరణ, రాష్ట్రవ్యాప్తంగా కేటాయించబడిన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల సమాచారం, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ పూర్తి వివరాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాలుగా వినియోగించబడే విద్యుత్ వివరాలను డాష్‌బోర్డులో పొందుపరిచినట్లు సతీష్‌రెడ్డి తెలిపారు. దీనివల్ల ఏ మేరకు విద్యుత్ వినియోగం, ఇంకా ఎంత లోడ్ కావాలో తెలుసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.


కర్ణాటక ఇంధన శాఖ మంత్రికి వివరిస్తున్న సతీష్ రెడ్డి

ప్రశాంతంగా మార్కెట్ వేలాలు

మద్దికెర: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ బండారు సుహాసిని, డీఎల్‌పీఓ శ్రీకాంత్ చౌదరి అధ్యక్షతన బుధవారం దినసరి, వారపు సంత, వాహనాలకు ఏడాది పాటు సుంకం వసూలు చేసుకునే హక్కులకు వేలాలు నిర్వహించినట్లు ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి తెలిపారు. దినసరి మార్కెట్ రూ.2,02,000, వారపు సంత మార్కెట్ రూ.87,000 లకు, బస్టాండు వాహనాల పార్కింగ్ రూ.2,52,000లకు, మాంసం మార్కెట్ రూ.25000లకు వేలంపాడి వ్యాపారులు దక్కించుకున్నారు. గతేడాది కంటే రూ.3 వేలు ఆదాయం పెరిగినట్లు అధికారులు తెలిపారు.

వాల్మీకుల సమ్మేళనం జయప్రదం చేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ రూరల్: వాల్మీకి/బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం శుభ పరిణామమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై.రామయ్య, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రాయలసీమలోని వెనుకబడిన ప్రాంతంలో ఉన్న వాల్మీకి/బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అడుగులు పడ్డాయన్నారు. ఇందుకోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ అన్ని జిల్లాల్లో వాల్మీకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2న కర్నూలులోని జెడ్పీ కార్యాలయం నుంచి ర్యాలీ, వాల్మీకి సెంటర్లో బహిరంగ సభ ఉంటుందన్నారు. వాల్మీకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ నారాయణదాస్, వాల్మీకి కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుంతాదేవి, జెడ్పీటీసీ ఉరుకుందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా'.. కొండంత భరోసా


వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్సార్ ఆసరా' పథకం పొదుపు మహిళలకు కొండంత ఆసరాగా నిలుస్తోందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో పట్టణానికి చెందిన 1,627 స్వయం సహాయక పొదుపు గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడతలో మంజూరైన రూ.9.80 కోట్ల మెగా చెక్కును సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘుతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు పొదుపు రుణాలను మాఫీ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆదరించాలని కోరారు. పట్టణంలో మంచినీటి కొరత తీర్చేందుకు ప్రభుత్వం రూ.142 కోట్లు మంజూరు చేసిందన్నారు. జీడీపీ నుంచి ఎమ్మిగనూరుకు మంచినీరు సరఫరా అవుతుందన్నారు. అలాగే పట్టణంలోని అన్ని వార్డుల్లో రోడ్ల నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, పార్టీ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, మెప్మా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు హేమలత ప్రసంగించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు నజీర్‌అహమ్మద్, దివ్యకళ, కో–ఆపరేటివ్ స్టోర్స్, టౌన్‌బ్యాంక్ చైర్మన్లు షబ్బీర్‌అహమ్మద్, యూకే రాజశేఖర్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజల అవసరాలకనుగుణంగా రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో రూ.2 కోట్లతో శిల్పా ఎస్టేట్ నుంచి మిలటరీ కాలనీ వరకు, లక్ష్మణ్ థియేటర్ నుంచి ఎస్ఎస్ ట్యాంక్ వరకు నిర్మించిన బీటీ రోడ్లు, అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్మించిన సీసీ రోడ్డు, పార్క్ ప్రహరీలను నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. వార్డుల్లో అవసరమైన చోట్ల రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


కార్యక్రమానికి హాజరైన మహిళలు

అక్కచెల్లెమ్మల ఆనందహేల

ఆలూరు: జగనన్న ప్రభుత్వంలో అక్కచెల్లెమ్మలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. దేవనకొండలో సహకార పరపతి సంఘం సమావేశం హాల్లో పార్టీ మండల కన్వీనర్ కప్ప ట్రాళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో మండలంలోని 622 పొదుపు సంఘాల్లోని 6,145 మంది మహిళలకు మంజూరైన రూ.1.92 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. అంతకముందు సీఎం చిత్రపటానికి పొదుపు మహిళలతో కలసి పాలాభిషేకం చేశారు. డీఆర్డీఏ వైకేపీ పీడీ ఎం.వెంకటసుబ్బయ్య, ఎంపీపీ లక్ష్మిదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు శాంతి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, దివాకర్‌నాయుడు, చిట్టెం చిన్నయ్య, హంపిరెడ్డి, వీరేష్, ఎంపీడీఓ గౌరీదేవి, ఏపీఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.


దేవనకొండలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపుమహిళలు

కల్యాణ మండపం ప్రారంభం

మద్దికెర: ఆలయాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఆధ్యాత్మిక సేవలో తరించాలని ప్రముఖ విరాళదాత పారా విశ్వనాథ్ అన్నారు. బుధవారం పెరవలి బీసీ కాలనీలో ఆదిలక్ష్మమ్మ పేరిట రూ.3 లక్షలతో నిర్మించిన మండపాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండపంలో పెళ్లిళ్లు ఇతర కార్యక్రమాలు ఉచితంగా నిర్వహించుకోవచ్చన్నారు. అనంతరం భజన బృందాన్ని అభినందించారు. ఉప సర్పంచ్ గోపాల్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఆలూరు రూరల్: స్థానిక ఎస్‌బీఐ సమీపంలో నివాసం ఉండే శతాధిక వృద్ధురాలు ఖాతున్ బీ (101) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఖాతున్ బీ ఆలూరులోని పెద్ద కోడలి దగ్గర ఉండేది. ఈమె గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో మంచానపడ్డారు. బుధవారం ఆరోగ్యం విషమించి కన్నుమూశారు. ఖాతున్‌బీకి ఐదుగురు కుమారులు, ఐదుగురు కూతుర్లు సంతానం ఉన్నారు.

ఆలూరులో దొంగల హల్‌చల్

ఆలూరు: ఆలూరులో మూడు రోజులుగా అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన నలుగురు దొంగలు చోరీలకు పాల్పడ్డారు. మంగళవారం రాత్రి హత్తిబెళగల్ గ్రామ రోడ్డు సమీపంలో బోయ నాగరాజు, కురుబ లక్ష్మి, కురుబ మహేష్ ఇళ్లకు తాళాలువేసి ఉన్న విషయాన్ని గమనించి చేతివాటం ప్రదర్శించారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అర్ధరాత్రి కాపుగాసి నిందితుడు గుంతకల్లుకు చెందిన హరిజన రవిని పట్టుకున్నారు. మరో ముగ్గురు పరారైనట్లు సమాచారం. ఇదిలాఉండగా బాధితులు బోయ నాగరాజు ఇంట్లో అరతులం బంగారు కమ్మలు, చెవిపోగులు, రూ.13 వేలు నగదు, కురుబ లక్ష్మి ఇంట్లో 15 తులాల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ చంద్రశేఖర్ కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

31న వేలం పాట

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరిలో ఈనెల 31వ తేదీన పంచాయతీకి సంబంధించిన బస్టాండ్, సంత మార్కెట్ నిర్వహణ హక్కుల వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ రామాంజనేయులు బుధవారం తెలిపారు. బస్టాండ్‌కు రూ.50 వేలు డిపాజిట్, లక్ష రూపాయలు సాల్వెన్స్ సర్టిఫికెట్, సంత మార్కెట్‌కు రూ.10 వేలు డిపాజిట్, లక్ష రూపాయల సాల్వెన్స్ సర్టిఫికెట్‌తో వేలంలో పాల్గొనాలన్నారు.

ఎరువుల స్టాక్ వివరాలు తెలపండి

ఎమ్మిగనూరురూరల్: ఎరువుల దుకాణాల యజమానులు స్టాక్ వివరాలు తప్పనిసరిగా తెలియచేయాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి కోరారు. బుధవారం స్థానిక కోరమాండల్, త్రివేణి ఎరువుల దుకాణాలను ఏడీఏ, ఏఓ మహేశ్వరరెడ్డి తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ ఎరువుల స్టాక్‌కు, ఈ–పాస్‌కు టాలీ చేయాలన్నారు. దుకాణాల్లో ఎంత స్టాక్ ఉందో తెలిస్తే వచ్చే ఖరీఫ్‌కు రైతులకు ఎంతమేర ఎరువులు అవసరమో అంచనా వేయవచ్చని తెలిపారు. ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించాలని, రైతు పేరు, సెల్ నంబర్ నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

క్షయను నిర్మూలిద్దాం

ఆలూరు రూరల్: క్షయ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజింగ్ అధికారి డానియల్ ఫ్రాంక్లిన్ అన్నారు. క్షయ (టీబీ) నివారణ దినోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన మొలగవల్లి పీహెచ్‌సీ పరిధిలోని హెల్త్ సబ్ సెంటర్లలో ప్రజలకు టీబీ నివారణపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జర్వం వస్తున్నా, బరువు తగ్గిపోయి ఛాతి నొప్పి వస్తున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే ప్రభుత్వం ఖరీదైన మందులను ఉచితంగా ఇవ్వడంతో పాటూ పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 చొప్పున ఆరు నెలల పాటు అందిస్తుందని వివరించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు మందులు మింగిస్తున్న ఆశా కార్యకర్తలకు సాధారణ టీబీకి రూ.వెయ్యి, టీబీ ముదిరిన వారికి మందులు మింగిస్తే రూ.5వేలు పారితోషకం అందిస్తారన్నారు. జిల్లా క్షయ నిర్మూలన అధికారి సుధాకర్, ఆలూరు టీబీ నివారణ అధికారి గోపాల్ పాల్గొన్నారు.

కబడ్డీ విజేత గోనెగండ్ల


గోనెగండ్ల జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కృష్ణగిరి: శ్రీరామనవమి సందర్భంగా సంగాల గ్రామంలో నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో గోనెగండ్ల జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులుగా జరిగిన పోటీల్లో 20 జట్లు పోటీపడగా గోనెగండ్ల, ఓర్వకల్ మండలం కాల్వ హుసేనాపురం జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా మూడవ స్థానంలో తుగ్గలి మండలం నునసరాళ్ల, నాల్గవ స్థానంలో కోడుమూరు మండలం వల్కూరు జట్లు గెలుపొందాయి. విజేత జట్లకు వైఎస్సార్‌సీపీ నాయకులు కురువ గిడ్డయ్య, రామచంద్రుడు, చిన్న మద్దిి, చిన్నరాముడు, వలంటీర్లు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందజేశారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన


మాట్లాడుతున్న ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సుజాతమ్మ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో సమీకృత వ్యవసాయం, వాటి విధానంపై బుధవారం కర్నూలు, నంద్యాల జిల్లాల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ మాట్లాడుతూ.. రైతులు లాభసాటి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సహకారంతో ఉమ్మడి జిల్లా నుంచి వాటర్ షెడ్ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులు 60 మందికి ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సమీకృత వ్యవసాయ విధానంలో లాభదాయకంగా గొర్రెలు, మేకలు, పెరటి కోళ్ల పెంపకం, పాలిచ్చే పశువుల పెంపకంలో మెలకువలు వివరించారు. ఏప్రిల్ 2వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు రమేష్‌నాయక్, లక్ష్మణ్, నిరంజన్‌రెడ్డి, అపర్ణ, మౌనిక, మహదేవయ్య, రైతులు పాల్గొన్నారు.